# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

సుజాత బస్టాండులో నిల్చుంది. మధ్యాహ్నం అవటంవల్ల జనసంచారం బొత్తిగా లేదు. తలొంచుకుని ఆలోచిస్తున్న సుజాత ఒక్క క్షణం తల ఎత్తి ఎదురుగా కన్పించే దృశ్యాన్ని చూసి నోట మాట రానట్టుగా వుండిపోయింది.

ఒకతను తూలుకుంటూ వస్తున్నాడు. అతను వచ్చి బార్ పట్టుకుని నిలబడి సుజాత పైకి వాలిపోతున్నాడు. అతని కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. అతను తాగి వున్నాడేమో, తన నేమైనా చేస్తాడేమోనని దూరం దూరంగా జరుగుతోంది. అతను తూలి, తూలి సుజాతమీద పడిపోయాడు. అతనివళ్ళు విపరీతంగా కాలిపోతూండటంతో తను తప్పు చేశానన్న ఫీలింగ్‌తో ఆమె బాధపడింది. ఆటోని పిలిచింది. ఆటోవాడి సాయంతో అతనిని సుజాత ఆటోలో ఎక్కించి డాక్టరు దగ్గిరకి తీసికెళ్ళింది. డాక్టరు ఇంజక్షన్ చేశాక కొన్ని నిముషాల్లో జ్వరం తగ్గటంతో అతను "నాకు సాయం చేశారు థాంక్స్! జ్వరం వచ్చినపుడు నా కళ్ళు ఎర్రబడి శరీరం వశం తప్పుతుంది. మీరేం కంగారు పడలేదుగా!" అన్నాడు.

సుజాత నవ్వి "ఆరోగ్యం జాగ్రత్త" అంటూ ఇవతలికి వచ్చేసింది.

**-కె.రఘుపతి, పి. చిలుకారావు**
(సికింద్రాబాద్)

*స్రవంతి నెం: 18లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత డాక్టర్ మట్టా సుగుణరావు పెట్టిన పేరు : డిటెక్షన్*

*ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ చందు సోంబాబు*



మిత్రుడు మల్లాది ఒక్క రోజు గడువిచ్చి ఈ మినీ కథల్లో రెండు సెలక్ట్‌చెయ్యమన్నాడు.

కథ రాయటం చాలా కష్టం. అదీ మినీ కథ అయితే మరీ కష్టం. కానీ ఉత్సాహంతో ఎంతో మంది రాశారు.

కేవలం రెండు కథలనే స్రవంతి ప్రచురణకి స్వీకరిస్తుంది.

ఈ శీర్షికలో పాల్గొన్న రచయితలు, రచయిత్రులు చాలా మటుకు బాగా రాశారనే అభిప్రాయం నాకు కలిగింది.

స్థాయిలో దరిదాపు అన్నీ ఈక్వల్ గా ఉన్నాయి.

1) శ్రీ ఈతకోట సుబ్బారావు—నటి.
2) శ్రీ వి. భాస్కరరావు—రాక్షసుడు

ఎన్నిక చేశాను.

నిప్పుని నివురు కమ్మినట్టు, నిజం కూడా చేదుగా వుంటుంది. అందుకే అబద్ధాన్ని నమ్మినంతగా ఈ లోకం నిజాన్ని నమ్మదు. ఆ కోవలోకే పై రెండు కథలు వచ్చాయి.

అయితే ఓ మాట.

రచయితగా కొత్త వాళ్ళని ప్రోత్సహించడం మొదట్నుంచీనాకు అలవాటు.

కొందరు రచయితలు—ఇలా కొత్తగా రాసేవారి స్థాయిని, రాసిన వాడినీ చాలా తక్కువన్నట్టు అభిప్రాయం ఇదివరలో వ్యక్త పరచారు. అలా చెప్పడం తామేదో గొప్పస్థాయిలో ఊహించుకోవడం, పర్యవసానం కొత్తవారిలో ఉత్సాహాన్ని చంపడం జరుగుతోంది.

ఈ నాడు రాస్తున్న మా స్థాయి ఒకప్పుడి ఇదే లెవెల్ అని మరచిపోకూడదు.

కొత్తవాళ్ళని ప్రోత్సాహించడం అన్ని విధాల మంచిది.

**—చందు సోంబాబు**

## నటి

మధిర ఓ అగ్రనటి. సినీ రంగంలో ప్రవేశించిన కొద్ది కాలంలోనే ఉన్నత తారాపథంవేపు దూసుకుపోయిన కళామూర్తి. మహోన్నతమైన ఆమె నటనకు ప్రజలందరూ నీరాజనాలందించారు. ఆమెకి లభించిన గౌరవప్రదమైన బిరుదులు, అభినందనలు, సన్మానాలు కోకొల్లలు.

మధిర నటించిన సినిమా విడుదలైంది. అందులో ఆమె అద్భుతంగా నటించి "కరుణ" పాత్రకు జీవంపోసింది. ఉన్నతమైన సాంఘిక విలువలకి ప్రతిబింబించే ఆ సినిమా గురించి, అందులోని హీరోయిన్ "కరుణ" పాత్రధారి యైన మధిర నటన గురించి ప్రజలందరూ వేనోళ్ళ పొగిడారు. పత్రికలన్నీ బహుముఖంగా ప్రస్తుతించాయి.

ఆ సినిమా ఓ మధ్య తరగతి కుంటుంబ గాథా చిత్రం. కరుణ తండ్రి పచ్చి త్రాబోతు, జూదరి. కష్టాలను కన్నీళ్ళను చిరునవ్వుతో భరించే తల్లంటే అమితమైన ప్రేమ కరుణకి. తల్లి, భర్తను గురించిన వేదనతో మంచాన పడుతుంది. తల్లిని రక్షించుకోవడం కోసం ప్రక్కఇళ్ళలో పాచిపనులు చేస్తూ, మిషనుకుడుతూ, చన్నపిల్లలకి ట్యూషన్‌లు చెప్పుతూ పడరాని బాధలు పడుతుంది. కరుణ పడే బాధలకి మహిళాప్రేక్షకులంతా కంటతడి పెట్టుకున్నారు.

అందులోని ఓ సన్నివేశమైతే స్త్రీలోకాన్ని కదిలించి వేసింది. కరుణ తల్లితో చెప్పి పనికి వెళ్ళింది. కాసేపటికి కరుణతండ్రి తప్పత్రాగి తూలుతూ వచ్చాడు. డబ్బుకోసం భార్యని వేధించడం మొదలుపెట్టాడు. శరీరంలోని రక్త మాంసాలు తప్ప తాను దాచుకున్నవి ఏమీ లేవని ఏడుస్తూ చెప్పింది.

ఆమె మెళ్ళోని మంగళసూత్రం కావాలని అడుగుతాడు. హైందవ స్త్రీకి పరమ పవిత్రమైన సూత్రాన్ని త్రెంచి ఇవ్వమంటుంది. బలవంతగా తీసుకోబోతే పెనుగులాడుతూ అడ్డం పడుతుంది.

దాంతో కరుణ తండ్రి రెచ్చిపోయి ఆమె గొంతు పిసికి చంపేస్తాడు.

సరిగ్గా అప్పుడే కరుణ వస్తుంది. తల్లిని చూసి బావురుమంటుంది. ఆవేశంలో తండ్రి చొక్కాపట్టుకుని ఊపుతూ

"అంత దారుణంగా అమ్మనెలా చంప గలిగావు నాన్నా" వెక్కిళ్ళమధ్య అడిగింది కరుణ తండ్రిని.

కరుణ రసాభరితమైన ఈ సన్నివేశాన్ని మహిళలంతా ముక్తకంఠంతో మెచ్చుకున్నారు.

విచక్షణా రహితంగా భార్యని చంపిన కిరాతకుడైన తండ్రికి బుద్ధిచెప్పి తల్లి ఆత్మశాంతి చేకూర్చి, చివరికి నిజాయితీతో న్యాయస్థానానికి లొంగిపోయిన మధ్యతరగతి యువతిగా, తల్లి ప్రేమ కోసం అలమటించిన కూతురిగా, మధిర అపూర్వంగా నటించి అబాల గోపాలం యొక్క మన్ననలను అందుకుంది.

* * *

మధిర అభినందన సభనుంచి నేరుగా ఇంటికి